# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 18 ఫిబ్రవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## కేసీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదినం సందర్భంగా రాజకీయ వర్గాల నుంచి శుభాకాంక్షల వెల్లువ వెల్లువెత్తింది. సోషల్ మీడియా వేదికగా పలు వురు ప్రముఖులు, పార్టీ నేతలు, అభిమానులు ఆయనకు దీర్ఘాయుష్షు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో నిమగ్నమై రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ఆయనకు భగవంతుడు సంపూర్ణ ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ఆకాంక్షించారు. రాజకీయ భేదాభిప్రాయాలకు అతీతంగా ప్రజాసేవే ముఖ్యమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు

మిగితా 4వ పేజీలో

## భారత్-ఫ్రాన్స్ మధ్య కీలక ఒప్పందాలు

- రక్షణ, ఏఐ, ఇంధనం, సాంకేతికత రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం



**బలగం టీవీ, ముంబై**

భారత్-ఫ్రాన్స్ దౌత్య సంబంధాల్లో కీలక ముందడుగు పడింది. రక్షణ, కృత్రిమ మేధస్సు, ఇంధనం, సాంకేతికత, వాణిజ్యం, ఆరోగ్య రంగాల్లో కలిపి 20కిపైగా ఒప్పందాలు కుదిరాయి. మంగళవారం ముంబైలో జరిగిన భేటీలో ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మక్రాన్ ఈ ఒప్పందాలకు ముద్ర వేశారు.ఏఐ సమ్మిట్‌కు హాజరయ్యేందుకు భారత్‌కు వచ్చిన మక్రాన్, మోదీతో విస్తృత చర్చలు జరిపారు. భారత్ మాకు నమ్మకమైన వ్యూహాత్మక భాగస్వామి అని మక్రాన్ పేర్కొన్నారు. రఫెల్ యుద్ధవిమానాల నుంచి జలాంతర్గాముల వరకూ రక్షణ రంగంలో సహకారం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**'ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్' ఆవిష్కరణ**

సంయుక్త మీడియా సమావేశంలో మోదీ మాట్లాడుతూ, ప్రపంచం అనిశ్చిత దశలో ఉన్న ఈ సమయంలో భారత్--ఫ్రాన్స్ భాగస్వామ్యం అంతర్జాతీయ స్థిరత్వానికి శక్తిగా నిలుస్తుందన్నారు. ఇరుదేశాలు 'ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్'ను ఆవిష్కరించాయని తెలిపారు. పరస్పర సహకారంతోనే ఆవిష్కరణలు సాధ్యమని పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధస్సు కేంద్రం, డిజిటల్ సైన్స్ మరియు టెక్నాలజీ కేంద్రం, ఏరోనాటిక్స్ నైపుణ్యాల పెంపుకు జాతీయ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

**రక్షణలో కీలక ముందడుగు**

భారత్--ఫ్రాన్స్ 10ఏళ్ల రక్షణ సహకార ఒప్పందాన్ని పునరుద్ధరించుకున్నాయి. అత్యాధునిక 'హేమర్' క్షిపణులను భారత్‌లో తయారు చేసేందుకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఫ్రాన్స్ రక్షణ మంత్రి క్యాథరిన్ వౌట్రిన్ పాల్గొన్నారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) మరియు ఫ్రాన్స్‌కు చెందిన Safran Electronics & Defense మధ్య హేమర్ క్షిపణుల తయారీకి జాయింట్ వెంచర్ ఒప్పందం కుదిరింది. దీంతో ఈ క్షిపణులు భారత్‌లోనే తయారుకానున్నాయి.అలాగే ఎయిర్‌బస్, టాటా ఆధునాతన వ్యవస్థలతో కలిసి హెచ్-125 హెలిక్యాప్టర్లను తయారు చేయనున్నట్లు ప్రకటించారు. ఎవరెస్ట్ శిఖరం ఎత్తులోనూ విహరించగల హెలిక్యాప్టర్లను తయారు చేసి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇరుదేశాల సైన్యాల్లో అధికారుల పరస్పర నియామకానికి (రిసిప్రొకల్ డిప్లాయ్‌మెంట్) కూడా అవగాహన కుదిరింది. ఈ ఒప్పందాలతో భారత్--ఫ్రాన్స్ వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం కానుంది.

## కాంగ్రెస్‌కు మరో 7.. బీఆర్ఎస్‌కు ఒకటి

- మూడు మున్సిపాల్టీల ఎన్నిక మళ్లీ వాయిదా

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

సోమవారం వాయిదా పడ్డ 11 మున్సిపాల్టీల పాలక మండళ్లకు మంగళవారం ఎన్నికలు నిర్వహించారు. వివిధ కారణాల వల్ల 3 స్థానాల్లో ఎన్నిక మళ్లీ వాయిదా పడింది. దాంతో 8 మున్సి పాల్టీల పాలక మండలిని సభ్యులు ఎన్నుకున్నారు. అందులో 7 కాంగ్రెస్‌కు దక్కగా, ఒకటి బీఆర్ఎస్ గెలుచుకుంది. ఇబ్రహీంపట్నం, క్యాత న్‌పల్లి, ఖానాపూర్ మున్సి పాల్టీల్లో ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల సంఘు ం అధికారులు ప్రకటిం చారు.

ఇక లక్కీ డ్రాలో తొర్రూర్ మున్సిపాల్టీని కాంగ్రె స్ తన ఖాతాలో వేసుకుంది. మంగళ వారం జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థులు తుణం శ్రవణ్ చైర్మెన్‌గా, సోమ రజినీ వైఎస్ చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. ఇల్లందు లో దొడ్డ కిరణ్ మిత్ర, సుల్తానాబాద్‌లో అంతటి పుష్పలత, కాగజ్ నగర్‌లో షాహీన్ సుల్తానా, జహీరా బాద్‌లో యూనస్, డోర్నక ల్‌లో కొండేటి రాజకుమారి కాంగ్రెస్ నుంచి చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. ఇంద్రేశం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పి.హరీశ్‌రెడ్డి చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. కాగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాల్టీ వివాదం హైకోర్ట్‌కు చేరింది. 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరిని ఎవరో కిడ్నాప్ చేశారని ఆయన కొడుకు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్ట్ గురువారం తమ ముందు యాదగిరిని హాజరు పర్చాలని పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. అయితే కోర్ట్ అర్డర్ అందక ముందే ఇబ్రహీంపట్నం చైర్మెన్ ఎన్నికను అధికారులు పూర్తి చేశారు.

బీఆర్ఎస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి మున్సిపల్ చైర్మెన్‌గా ఎన్నికయ్యారు. హైకోర్ట్ ఎన్నికపై స్టే విధించడంతో ఆయనకు అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వలేదు. సోమవారం 105, మంగళవారం మరో 8 పాలక మండళ్లకు జరిగిన ఎన్నికల్లో మొదటి రోజు 81, రెండో రోజు మరో 7తో కలిపి కాంగ్రెస్ అత్యధికంగా 88 మున్సిపాల్టీలను దక్కించుకుంది. బీఆర్‌స్‌కు మొదటి రోజు 18, రెండో రోజు ఒక దానితో కలిపి మొత్తం 19 మున్సిపాల్టీలు దక్కాయి. ఇంకా 3 మున్సిపాల్టీల ఫలితాలు తేలాల్సి ఉంది. కాగా వీటిని ఎప్పుడు నిర్వహించేది ఎన్నికల కమిషన్ ప్రకటించలేదు. ఈ నెల 19న కోర్ట్ నిర్ణయం తర్వాత మిగిలిన మూడు మన్సిపాల్టీల పాలక మండళ్లకు ఎన్నిక నిర్వహించే అవకాశం ఉందని భావిస్తున్నారు. కాగా 112 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్ల పాలక మండళ్ల ఎన్నిక పూర్తి కావడంతో కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఎత్తి వేస్తున్నట్టు ఎన్నికల సంఘం ప్రకటించింది.

**మొత్తం మున్సిపాల్టీలు 116**
**ఫలితాలు వెల్లడైనవి 113**

| | |
|---|---|
| కాంగ్రెస్ | 88 |
| బీఆర్ఎస్ | 19 |
| బీజేపీ | 1 |
| ఏఐఎఫ్‌బీ | 1 |
| ఇండిపెండెంట్లు | 4 |

## కేసీఆర్ సాహసాన్ని గుర్తుచేసుకోవాలి



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ కోసం జెండా ఎత్తిన కాలాన్ని గుర్తు చేసుకుంటే కేసీఆర్ సాహసం, చరిత్ర ప్రజలకు స్పష్టమవుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు అన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తులు ఉన్నప్పటికీ తెలంగాణ ఉద్యమాన్ని ప్రారంభించడం అసాధారణ సాహసమన్నారు. మీడియా, మనీ, మజిల్ పవర్ ఏదీ లేకపోయినా, తెలంగాణకు న్యాయం చేయాలనే సంకల్పమే కేసీఆర్‌ను ముందుకు నడిపిందన్నారు. 14 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం, త్యాగం, పోరాటం ప్రజలకు తెలిసిందేనన్నారు. అనంతరం పదేళ్ల పాటు రాష్ట్రాన్ని అద్భుతంగా పరిపాలించారని కొనియాడారు.ఢిల్లీలో ఒక సందర్భంలో అరుణ్ జైట్లీ కేసీఆర్‌ను ఉత్తమ ఉద్యమకారుడిగానే కాక ఉత్తమ పరిపాలకుడిగానూ అభివర్ణించారని కేటీఆర్ గుర్తుచేశారు. దేశానికి దిక్సూచిగా తెలంగాణను నిలబెట్టిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు.ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కొందరు కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జాతి గౌరవం గురించి మాట్లాడే అర్హత ఉద్యమంలో పాల్గొన్న వారికే ఉంటుందని అన్నారు.తెలంగాణ చరిత్రలోని మహనీయులను ప్రస్తావిస్తూ రాణి రుద్రమ, కొమురం భీం, సమ్మక్క--సారలమ్మ, సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, భాగ్యరెడ్డి వర్మ, తుర్రేబాజ్ ఖాన్, కాళోజీ, దాశరథి వంటి నాయకుల త్యాగాలను స్మరించారు. తెలంగాణలో రెండు జాతులే ఉన్నాయని---ఒకటి తెలంగాణ వాదులు, మరొకటి తెలంగాణ ద్రోహులని వ్యాఖ్యానించారు.

**"తెలంగాణే కేసీఆర్ ఆనవాళ్లు"**

కేసీఆర్ తనను జాతిపితగా ఎప్పుడూ ప్రకటించుకోలేదని, ప్రజలే ఆ గౌరవాన్ని ఇచ్చారని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటమే కేసీఆర్ ఆనవాళ్లని, దాన్ని ఎవరూ చెరిపేయలేరన్నారు. మళ్లీ తెలంగాణలో గులాబీ జెండా ఎగరేయడం, కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చూడడమే ఆయనకు ఇచ్చే ఉత్తమ కానుక అని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జన్మదిన వేడుకలు నిర్వహించిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ ప్రసంగాన్ని ముగించారు.

## ఘనంగా కేసీఆర్ 72వ జన్మదిన వేడుకలు

### 72 కిలోల కేక్ కట్ -- ఉద్యమం, సంక్షేమంపై డాక్యుమెంటరీ ప్రదర్శన

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**


తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు మంగళవారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, యువ నాయకుడు తలసాని సాయి కిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి.రామారావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అతిథులుగా హాజరయ్యారు.కేసీఆర్ 72వ జన్మదినాన్ని పురస్కరించుకుని 72 కిలోల భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమం, సంక్షేమ పథకాలపై రూపొందించిన పాటలు, డాక్యుమెంటరీలను ప్రదర్శించారు.

ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, తన ప్రాణాలను ఫణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడిగా కేసీఆర్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. పదేళ్ల పాలనలో

మిగితా 4వ పేజీలో

## మూడు నగర పాలక సంస్థల పరిధిలో
# పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలి

- కమిషనర్లు ఉదయం 6 గంటలకే క్షేత్ర పర్యటనలు చేయాలి
- చెత్త కనిపిస్తే కఠిన చర్యలు తప్పవు
- అక్రమ ప్రకటనదారులపై కఠిన చర్యలు
- రాష్ట్రవ్యాప్తంగా వీధి దీపాల నిర్వహణకు యూనికోడ్ సిస్టమ్ అమలు
- కొత్తగా ఎన్నికైన మేయర్లు, చైర్మన్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై సమీక్ష



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ కోర్ అర్బన్ ప్రాంతంలోని మూడు నగర పాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను స్పష్టమైన ఆదేశాలిచ్చారు. పరిశుభ్రత విషయంలో క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలన చేస్తానని, ఎక్కడైనా చెత్త కనపడితే సహించమని అధికారులను హెచ్చరించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి నగర పాలక సంస్థల కమిషనర్లు తెల్లవారుజామున ఆరు గంటలకే క్షేత్ర పర్యటనలు చేయాలని ఆదేశించారు.

పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలపై ముఖ్యమంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. మూడు నగర పాలక సంస్థల పరిధిలో ప్రకటనల ఆదాయం పెంపు పాలసీపై సమీక్షించారు. వివిధ అంశాలపై ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు."నగరంలో కూడళ్లు, ఇతర ప్రాంతాల్లో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలి. ఎలక్ట్రిక్, ఇతర కేబుళ్లు, సీసీ కెమెరాలు, ప్రకటనల బోర్డులు వాటిపై ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి. నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రైవేటు భూముల్లోనూ మల్టీలెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలి. నెక్లెస్ రోడ్డు పక్కన పలు ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలి" అని స్పష్టం చేశారు.ప్రకటనలకు సంబంధించి పెద్ద మొత్తంలో వివిధ రకాల బోర్డులు కనిపిస్తున్నా ఆశించిన ఆదాయం రాకపోవడంపై ముఖ్యమంత్రి గారు అధికారులను ప్రశ్నించారు. ముంబయి, అహ్మదాబాద్, బెంగళూర్‌ల్లోని ప్రకటనల ఆదాయంతో నగరంలో వస్తున్న ఆదాయాన్ని బేరీజు వేయాలని చెప్పారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరిస్తున్న ప్రకటనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాల ప్రకటనలకు 10 శాతం బోర్డులు కేటాయించాలని సూచించారు. ఈ సందర్భంగా పీపీపీ, ఇతర నమూనాల్లో

మిగితా 4వ పేజీలో

### లైఫ్ సైన్సెస్ రంగంలో పెట్టుబడులకు ప్రభుత్వం పూర్తి మద్దతు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌ను లైఫ్ సైన్సెస్ రంగంలో గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బయోఏషియా-2026 సదస్సు ప్రారంభోత్సవం సందర్భంగా పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో భేటీ అయ్యారు.

భారత్ ఫ్యూచర్ సిటీలో లైఫ్ సైన్సెస్ జీసీసీలు, ఇన్నోవేషన్ సెంటర్ల కోసం ప్రత్యేక జోన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



**కుదిరిన ప్రధాన ఒప్పందాలు:**

గ్లోబల్ కన్స్యూమర్ హెల్త్‌కేర్ సంస్థ ఒపెలా హెల్త్‌కేర్ 42 వేల చ.అ. విస్తీర్ణంలో జీసీసీ విస్తరణ, 500 ఉద్యోగాల కల్పన.

ఇండోనేషియాకు చెందిన జేపీఎఫ్ఏ గ్రూప్‌లోని వాక్సిండో జీనోమ్ వ్యాలీలో బీఎస్ఎల్-3 వ్యాక్సిన్ తయారీ కేంద్రం స్థాపన.

ట్రిడెన్స్ ఇన్‌కార్పొరేషన్ 18 వేల చ.అ.లో ఏఐ ఆధారిత ఇన్నొవేషన్ హబ్ ఏర్పాటు.

ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ జీనోమ్ వ్యాలీలో 12 ఎకరాల్లో 1 మిలియన్ చ.అ. విస్తీర్ణంతో ఆధునిక లైఫ్ సైన్సెస్ క్యాంపస్ స్థాపన.

ఈ సమావేశంలో తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ జీవవైజ్ఞానిక రాజధానిగా హైదరాబాద్

- తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాలు భాగస్వాములు కావాలి
- బయోఏషియా వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- హైటెక్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన 23వ బయో ఏషియా అంతర్జాతీయ సదస్సు

వివరాలు 4వ పేజీలో

## పంచాయతీలకు రూ.256 కోట్ల నిధులు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు రూ.256 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు మంగళవారం ఆ నిధులను పంచాయతీలకు విడుదల చేశారు. గతేడాది డిసెంబర్‌లో గ్రామ పంచాయతీలకు ఎన్నికలను నిర్వహించిన విషయం తెలిసిందే.

## ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు తీర్పు

- సిద్ధార్థరెడ్డి పిటిషన్ కొట్టివేత
- నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశం



**బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో**

సినీనటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడు సిద్ధార్థ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు ఖరారు చేసిన శిక్షను సమర్థిస్తూ, నాలుగు వారాల్లోపు లొంగిపోవాలని ఆదేశించింది.

ఇంటర్ చదివే సమయంలో ప్రత్యూష, సిద్ధార్థరెడ్డి ప్రేమలో పడ్డారు. 2002 ఫిబ్రవరి 23న ఇద్దరూ విషం తాగిన స్థితిలో ప్రైవేట్ ఆసుపత్రిలో చేరగా, చికిత్స పొందుతూ ఫిబ్రవరి 24న ప్రత్యూష మృతి చెందారు. కూల్‌డ్రింక్‌లో పురుగుమందు కలిపి తాగినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఆర్గానోఫాస్ఫేట్ అనే రసాయనం కారణంగా మరణించినట్లు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన వైద్యుల బృందం నివేదిక ఇచ్చింది. 2004లో పోలీసులు ఈ ఘటనను హత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు ప్రేరేపించేలా సిద్ధార్థరెడ్డి వ్యవహరించారని ట్రయల్ కోర్టు తేల్చి ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. తదనంతరం హైకోర్టు 2011లో శిక్షను రెండేళ్లకు తగ్గించి, జరిమానాను రూ.50 వేలకు పెంచింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ సిద్ధార్థరెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సీబీఐ దర్యాప్తు ఆధారంగా నిందితుడిపై ఐపీసీ 306 (ఆత్మహత్యకు ప్రేరేపించడం), 309 (ఆత్మహత్యకు యత్నించడం) సెక్షన్ల కింద ఛార్జిషీట్ దాఖలు చేశారు. మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించగా, హైకోర్టు దాన్ని రెండేళ్లకు కుదించింది.

2012లో సిద్ధార్థరెడ్డి, ప్రత్యూష తల్లి సరోజిని వేర్వేరుగా అప్పీలు దాఖలు చేశారు. తాజాగా తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, హైకోర్టు నిర్ణయాన్ని సమర్థిస్తూ నిందితుడు నాలుగు వారాల్లో లొంగిపోవాలని ఆదేశించింది. అయితే పోస్టుమార్టం నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, విధానం సరిగా లేదని వ్యాఖ్యానించింది.

## ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు దౌర్జన్యాలు చేశారని బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, కొప్పుల ఈశ్వర్, బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కలిసి పలు అంశాలపై వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు, కౌన్సిలర్లు దాడులకు పాల్పడినట్లు ఆరోపించారు. ఇబ్రహీంపట్నం ఎన్నికలపై కోర్టు స్టే అంశాన్ని కూడా ప్రస్తావించారు.వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ఎన్నికలు జరిగాయని, అయితే ఎన్నికలు సజావుగా నిర్వహించలేదని మండిపడ్డారు. విస్తృతంగా డబ్బు పంపిణీ చేసి, ప్రత్యర్థులపై దాడులు చేశారని ఆరోపించారు. చైర్మన్ ఎన్నికల సందర్భంగా కూడా హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. జనగామలో మహిళా కౌన్సిలర్‌ను చేయిపట్టి లాగిన ఘటనను ఉదాహరణగా చూపారు. తమకు అనుకూలంగా ఉంటే ఫలితాలను ప్రకటించి, లేదంటే దాడులు, వాయిదాలు వేస్తున్నారని విమర్శించారు. ఇబ్రహీంపట్నంలో ఎన్నిక పూర్తయిన తర్వాత కోర్టు స్టే పేరుతో ప్రక్రియను నిలిపివేశారని ఆరోపించారు. ఎన్నికల సంఘం తటస్థంగా వ్యవహరించడం లేదని, ప్రభుత్వ సంస్థలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మిగితా 4వ పేజీలో

## మెదక్ కలెక్టర్‌కు 6 నెలల జైలు



- కోర్టు ధిక్కారణ కేసులో హైకోర్టు ఆదేశం
- అప్పీల్‌కు నాలుగు వారాల గడువు

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ధిక్కరించినందుకు మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు హైకోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. అదనంగా రూ.2,000 జరిమానా కూడా విధిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

బోనాల్ గ్రామానికి చెందిన లక్ష్మీ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. భూ వివాదానికి సంబంధించి ఇచ్చిన కోర్టు ఆదేశాలను కలెక్టర్ అమలు చేయలేదని ఆమె ఆరోపించారు. పిటిషన్‌పై విచారణ అనంతరం కోర్టు, కలెక్టర్ వ్యవహారశైలిని తీవ్రంగా తప్పుబట్టింది. కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు నిర్ధారిస్తూ ఆరు నెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధించింది. అయితే, తీర్పుపై అప్పీల్ దాఖలు చేసుకునేందుకు నాలుగు వారాల గడువు కల్పించింది. అలాగే శిక్ష అమలును కూడా నాలుగు వారాలపాటు వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు స్పష్టం చేసింది.

## ముంబయికి సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముంబయి బయలుదేరి వెళ్లారు. మహారాష్ట్ర రాజధాని ముంబయిలో మూడు రోజుల పాటు జరిగే ముంబయి క్లైమెట్ వీక్‌లో కార్యక్రమంలో బుధవారం

మిగితా 4వ పేజీలో

## క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు



- మార్చి చివరి నాటికి లబ్ధిదారుల ఎంపిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- సచివాలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మొహమ్మద్ అజహరుద్దీన్‌తోఉన్నత స్థాయి సమీక్ష

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు.సచివాలయంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, మొహమ్మద్ అజహరుద్దీన్లతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, లబ్ధిదారుల ఎంపికపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సమావేశంలో హౌసింగ్ కార్యదర్శి విపి గౌతమ్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఆత్మగౌరవం కాపాడేలా పక్కా గృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. గతంలో హైదరాబాద్‌కు దూరంగా నిర్మించిన 42 వేల ఇండ్లలో సగం మంది మాత్రమే నివసిస్తున్నారని క్షేత్రస్థాయి సర్వేలో తేలిందని పేర్కొన్నారు. ఉపాధికి ఇబ్బంది కలగకుండా, మురికివాడల్లో నివసించే వారి కోసం ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే 5 నుంచి 10 అంతస్తుల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై చర్చించినట్లు వెల్లడించారు.క్యూర్ పరిధిలో లబ్ధిదారుల ఎంపికను యుద్ధ ప్రాతిపదికన మార్చి చివరినాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. సొంత స్థలం కలిగిన 28 వేల మంది లబ్ధిదారులకు ఈ నెలాఖరులోగా మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.

గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులే పూర్తి చేసుకునేలా హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయాలని నిర్ణయించారు. జేఎన్ఎన్‌యూ ఆర్ఎం పథకంలో శిథిలావస్థలో ఉన్న ఇండ్ల స్థానంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆర్ఆర్ఆర్ -- ఓఆర్ఆర్ మధ్య ప్రాంతంలో మధ్యతరగతి ప్రజల కోసం కేపీహెచ్‌బీ తరహాలో సరసమైన ధరలకు ఇండ్ల నిర్మాణానికి స్థలాల గుర్తింపు ప్రక్రియ ప్రారంభమైనట్లు వెల్లడించారు.

డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి కనీస వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి పేదవాడికి రాజకీయాలకు అతీతంగా ఇల్లు అందించడమే ప్రభుత్వ సంకల్పమని, అవినీతికి తావులేకుండా పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని మంత్రి స్పష్టం చేశారు.

# ఐబొమ్మ రవికి బెయిల్ మంజూరు..

- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు
- పాస్ పోర్టును పోలీసులకు అప్పగించాలని ఆదేశం



**బలగం టీవీ, హైదరాబాద్**

ఐబొమ్మ రవికి హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో కోర్టు పలు కఠిన నిబంధనలు విధించింది. హైకోర్టు ఆదేశాల ప్రకారం, రవి ప్రతి రోజు సీపీఎస్ అధికారుల ఎదుట హాజరుకావాల్సి ఉంటుంది. విచారణకు పూర్తిగా సహకరించాలని కోర్టు స్పష్టం చేసింది. అదేవిధంగా, దేశం విడిచి వెళ్లరాదని కూడా ఆదేశాలు జారీ చేసింది. మరింతగా, తన పాస్‌పోర్ట్‌ను సంబంధిత పోలీసు అధికారులకు అప్పగించాలని హైకోర్టు సూచించింది. విధించిన షరతులను ఉల్లంఘించిన పక్షంలో బెయిల్ రద్దు చేసే అవకాశం ఉందని కోర్టు హెచ్చరించింది.

# తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ..

- పోరాటయోధుడి పుట్టినరోజే తెలంగాణ రాబందుల పాలైంది
- బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

**బలగం టీవీ, హైదరాబాద్**




తెలంగాణలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని, కాంగ్రెస్‌– బీజేపీలు కుమ్మక్కై బీఆర్ఎస్ పార్టీని అణచివేసేందుకు కుట్ర పన్నుతున్నాయని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాలపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ ఎంపీ బండి సంజయ్ ఒకరికొకరు ప్రొటెక్షన్ ఇచ్చుకుంటున్నారని, వీరిద్దరి మధ్య ఉన్న అక్రమ సంబంధం బట్టబయలైందని విమర్శించారు. ఆమనగల్లులో ఒక్క సీటు వచ్చిన కాంగ్రెస్‌కు బీజేపీ మద్దతు ఇవ్వడమే దీనికి నిదర్శనమన్నారు. మెజార్టీ ఉన్నప్పటికీ మంత్రి వివేక్ వెంకటస్వామి ఒత్తిడితో అధికారులు ఎన్నికను వాయిదా వేస్తున్నారని ఆరోపించారు.

జనగాం లో ఒక దళిత మహిళా కౌన్సిలర్‌పై కాంగ్రెస్ నేత దాడి చేయడం దారుణమని, దీనిపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ దండే విఠల్ రెండు చోట్ల ఎక్స్ అఫీషియో ఓట్లు నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని, కడియం కావ్యకు ఎంపీగా కొనసాగే నైతిక అర్హత లేదని స్పష్టం చేశారు. ఒక మాజీ పోలీస్ అధికారిగా తాను బాధపడుతున్నానని చెబుతూ.. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారి కౌన్సిల్ హాల్‌లోకి ప్రవేశించడం చట్టవిరుద్ధమని అన్నారు. రేవంత్ రెడ్డి పోలీసులను వాడుకొని బీఆర్ఎస్ ను ఖతం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, పోరాట యోధుడు పుట్టిన రోజే తెలంగాణ రాబందుల పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు.

రేవంత్ రెడ్డి నియంతృత్వ పోకడలు మానుకోకపోతే నేపాల్, బంగ్లాదేశ్ తరహా పరిస్థితులు తెలంగాణలో వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మున్సిపల్ ఎన్నికల్లో జరుగుతున్న అక్రమాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో కల్వకుర్తి బీఆర్ఎస్ నేత శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు.




## తెలంగాణ జాతిపిత కేసీఆర్ అంటూ..
## పూరీ తీరాన కేసీఆర్ జన్మదిన వేడుకలు..

- ఒడిశా తీరాన అద్భుత సైకత శిల్పం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నేత చిర్రా రవీందర్ యాదవ్
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న కేసీఆర్ సైకత శిల్పం

**బలగం టీవీ, ఒడిశా:**

తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్) జన్మదిన వేడుకలు ఆదివారం ఒడిశాలోని పూరీ సముద్ర తీరంలో అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా శేరిలింగంపల్లికి చెందిన ఉద్యమకారుడు, భారాస సీనియర్ నాయకులు చిర్రా రవీందర్ యాదవ్ ప్రత్యేకంగా ఏర్పాటు చేయించిన కేసీఆర్ సైకత శిల్పం పర్యాటకులను మంత్రముగ్ధులను చేసింది. ఈ సందర్భంగా చిర్రా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ.. "తెలంగాణ ప్రజల దశాబ్దాల కలను నిజం చేసిన మహోన్నత నాయకుడు కేసీఆర్. తెలంగాణ జాతిపితగా ఆయన చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఆరు దశాబ్దాల పోరాటాన్ని గమ్యానికి చేర్చి, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత ఆయనదే. నేడు ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని పూరీ జగన్నాథుడి ఆశీస్సులతో ఈ సైకత శిల్పం ద్వారా మా గౌరవాన్ని చాటుకుంటున్నాం. రాజకీయాల్లో గెలుపోటములు సహజం, కానీ తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ స్థానం ఎప్పటికీ పదిలం. త్వరలోనే మళ్ళీ ప్రజా ఆశీర్వాదంతో కేసీఆర్ నాయకత్వంలో అధికారంలోకి వచ్చి అన్ని విమర్శలకు అభివృద్ధి ద్వారానే సమాధానం చెప్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భారాస కార్యకర్తలు, తెలంగాణ నుండి వచ్చిన పర్యాటకులు పాల్గొని కేసీఆర్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# క్రీడా రంగంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి..

- క్రీడల వైపు యువతను ప్రేరేపించేందుకు సీఎం కప్
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్




**బలగం టీవీ, వేములవాడ:**

క్రీడల పట్ల మా ప్రభుత్వనికి ప్రత్యేక దృష్టి పెట్టిందని,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడల పట్ల చాలా మక్కువతో ఉన్నారని, ఒలంపిక్స్ లో మన రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించేలా ముఖ్యమంత్రి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాజన్న సిరిసిల్ల వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 8వ తెలంగాణ రాష్ట్ర స్థాయి యువతి-- యువకుల యూత్ వాలీబాల్ పోటీలు నిర్వహించగా,రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి, ఒలింపిక్ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాలీబాల్ ఆడటానికి వచ్చిన క్రీడాకారులకు స్వాగతం తెలుపుతున్న.. వాలీబాల్ అసోసియేషన్ వారు ఓ కార్యక్రమాల్లో పాల్గొన్న సందర్భంగా రాష్ట్ర స్థాయి వాలీబాల్ కబడ్డీ పోటీలను మన ప్రాంతంలో నిర్వహించాలని అడగగా, వారికి ఇచ్చిన హామీ మేరకు నేడు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలను వేములవాడ లో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ ప్రాంతంలో రుద్రంగి లో వాలీబాల్ క్రీడాకారులు ఉన్నారని, ఈ ప్రాంతం నుండి జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. కబడ్డీ లో సనుగుల, మూడపల్లి, నూకలమర్రి లాంటి గ్రామాల్లో అనేక మంది క్రీడాకారులు ఉన్నారని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు ముందుకు పోయేందుకు ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఈ వయస్సులో చెడు మార్గంలో కి పోకుండా క్రీడల వైపు యువత వెళ్లాలని,సీఎం రేవంత్ రెడ్డి క్రీడాకారుల కోసం సీఎం కప్ ఏర్పాటు చేశారని,గ్రామీణ ప్రాంతాల్లో మంచి నైపుణ్యం కలిగిన క్రీడాకారులను బయటకు తీసుకురావడమే సీఎం కప్ లక్ష్యం మని అన్నారు.సుమారు 45 కు పైగా క్రీడలను సీఎం కప్ క్రీడా పోటీలలో చేర్చడం జరిగిందని,గ్రామీణ మండల జిల్లా రాష్ట్రస్థాయిలో క్రీడాకారులను వెలికి తీస్తున్నామని అన్నారు.. గత ప్రభుత్వం 9 ఏళ్లుగా డైట్ చార్జీలు పెంచలేదు, కానీ కాంగ్రెస్ వచ్చాక డేట్ చార్జీలు 40 శాతం పెంచడం జరిగింది,యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కోసం స్థలం సేకరణ జరుగుతుందని అన్నారు.నూతన పాలకవర్గం అందరి మన్నలు పొందుతూ ముందుకు పోవాలని,వేములవాడ పట్టణంలో గత ప్రభుత్వం స్టేడియం నిర్మాణం పక్కన పెట్టారు,నేడు ప్రజా ప్రభుత్వంలో దాని పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని అన్నారు. వేములవాడ పట్టణంలో త్వరలోనే 3 ఎకరాల్లో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడతామని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రోడి రాజు, రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు గజ్జెల రమేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి హనుమంత రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గిన్నె లక్ష్మణ్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ కుమార్, ఉపాధ్యక్షులు కోళ్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి..

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ సందర్శన




**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదవి, ఉన్నత శిఖరాలకు ఎదిగి, మిగతా విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను మంగళవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. సీబీఎస్ఈ విధానంలో పదో తరగతి మ్యాథ్స్ పరీక్షలు కొనసాగుతుండగా, ఇంచార్జి కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లైబ్రరీ పరిశీలించారు. స్కిల్ ఇండియా లో భాగంగా నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ కింద విద్యాలయంలో రిటైల్ ల్యాబ్ లో విద్యార్థులతో మాట్లాడారు.అనంతరం 9వ తరగతి గదికి వెళ్లి విద్యార్థులతో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెడుతున్నారా అని ఆరా తీశారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన సెలబస్ పూర్తి అయిందా అని ఆరా తీశారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టుల పాఠాలు మరోసారి చదివి వార్షిక పరీక్షలకు సిద్ధం కావాలని,ఈ తరగతిలోని అంశాలు పై తరగతుల్లో ఇంకా వివరంగా ఉంటాయని, ఇప్పుడే ప్రతి సబ్జెక్టు, పాఠాలపై మంచి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ విద్యాలయంలో చదివేందుకు వచ్చిన మంచి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వివిధ వృత్తులు, ఆర్మీ, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు.

**మధ్యాహ్న భోజనం తయారీ పరిశీలన**

విద్యాలయంలో మధ్యాహ్న భోజనం తయారీని ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. మెనూ ప్రకారం సిద్ధం చేసిన ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. కోడిగుడ్లు, బియ్యం, కూరగాయలు, పప్పులు, ఇతర పదార్థాల నాణ్యతా, గడువు తేదీని పరిశీలించారు. కిచెన్, స్టోర్ రూం నిర్వహణపై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ రామ్ సూరత్ యాదవ్, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, పీఆర్, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలి**

కోనరావుపేట మండలం మర్రిమడ్ల మరియు నిమ్మపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు.మండలానికి 577 ఇళ్ల నిర్మాణం మంజూరు చేయబడగా, వీటిలో 460 ఇళ్లకు ముగ్గు వేయబడినట్లు, బేస్మెంట్ స్థాయిలో 401, గోడల వరకు 325, స్లాబ్ స్థాయిలో 287 ఇళ్లకు పనులు పూర్తయినట్లు హౌసింగ్ అధికారులు వివరించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులతో సమావేశం కావాలని సూచించారు. లబ్దిదారులకు ఇటుకలు ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా.. సరైన ధరకు వచ్చేలా హౌసింగ్ అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలని ఆదేశించారు. మేస్త్రీలు, వడ్రంగి ఇతర పని వారితో మాట్లాడి ఇబ్బందులు దూరం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, హౌసింగ్ ఏఈ, తదితరులు పాల్గొన్నారు

# పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

- హర్షం వ్యక్తం చేసిన క్రైస్తవ సమాజం...

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**




సిరిసిల్ల పట్టణంలో నిర్వహించిన జిల్లా పాస్టర్స్ సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా జీవన్ ఇండియా, ఉపాధ్యక్షుడిగా దేవయ్య, ప్రధాన కార్యదర్శిగా రాజేష్ ఎన్నికయ్యారు. అలాగే సహాయ కార్యదర్శిగా సుంకే జోసఫ్, కోశాధికారిగా ప్రభుదాస్, ప్రోగ్రాం ఆర్గనైజర్లుగా దేవానంద్ మరియు ప్రేమ్ కుమార్, ఈసీ సభ్యులుగా అహరోన్, యెషయా బాబు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు జీవన్ ఇండియా మాట్లాడుతూ.. క్రైస్తవ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సమాజ బలోపేతానికి, సంఘ ఐక్యతకు, సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ క్రైస్తవ సమాజాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని అన్ని మండలాల పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు హాజరై నూతన కమిటీని అభినందించారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో పెద్దపులి కలకలం..

- **మూడు ఆవు దూడల మృతి..**
- **ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :**

**ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని తిప్పాపూర్ గ్రామ శివారులో పెద్దపులి సంచారం స్థానికంగా తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తోంది. పొరుగున ఉన్న సిద్దిపేట జిల్లా నుండి అటవీ మార్గం ద్వారా ఈ పులి తిప్పాపూర్ గ్రామ పరిధిలోకి ప్రవేశించినట్లు



తెలుస్తోంది..గత రెండు రోజులుగా గ్రామ శివారులో సంచరిస్తున్న పెద్దపులి, ఇప్పటికే మూడు ఆవు దూడలపై దాడి చేసి చంపివేసింది. పశువుల కళేబరాలను చూసిన రైతులు భయాందోళనతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పులి అడుగుజాడలను పరిశీలించారు. పులి సంచారం వాస్తవమేనని ధృవీకరించిన అధికారులు, గ్రామ ప్రజలు మరియు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.. ముఖ్యంగా రైతులు ఒంటరిగా పొలాలకు వెళ్లకూడదని, రాత్రి సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పులిని తిరిగి అడవిలోకి పంపేందుకు అటవీశాఖ సిబ్బంది చర్యలు చేపడుతున్నారు.



## గ్రామ పరిధిలో పులి సంచారం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

- **ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్**

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

గ్రామ ప్రజలందరికీ అత్యవసరంగా తెలియజేయునది ఏమనగా, మన గ్రామ పరిధి, సమీప అడవి ప్రాంతం మరియు పొలాల వైపు పులి సంచారం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందినది. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ప్రతి ఒక్కరూ అత్యంత అప్రమత్తంగా ఉండవలసిందిగా సూచించడమైనది.

ప్రజలు ఎవరూ ఒంటరిగా పొలాలు, చెరువు లేదా అడవి ప్రాంతాలకు వెళ్లరాదు. ముఖ్యంగా రాత్రి సమయంలో బయట తిరగడం పూర్తిగా నివారించాలి. పిల్లలను బయట ఒంటరిగా ఆడనివ్వకూడదు. పొలాలకు వెళ్లే వారు తప్పనిసరిగా గుంపులుగా వెళ్లాలి.




పశువులను బయట వదిలిపెట్టకుండా సురక్షితంగా కట్టివేయాలి. గ్రామ శివార్లు మరియు అడవి అంచుల వద్ద అనవసరంగా గుమిగూడరాదు.

పులి కనిపించినా లేదా అనుమానాస్పద శబ్దాలు వినిపించినా దగ్గరకు వెళ్లి ఫోటోలు లేదా వీడియోలు తీయడానికి ప్రయత్నించకూడదు. అవసరమైతే గ్రామంలో తగిన లైటింగ్ ఏర్పాటు చేసి రాత్రి వేళల్లో అదనపు జాగ్రత్తలు తీసుకోవాలి.

**పులి కనిపిస్తే వెంటనే చేయవలసినవి..**

వెంటనే ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, స్థానిక పోలీస్ స్టేషన్ లేదా గ్రామ అధికారులకు సమాచారం ఇవ్వాలి. అత్యవసర నంబర్లు 100 లేదా 112 కు కాల్ చేయాలి. గ్రామంలో అందరికీ తెలియజేసి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. పులి ఉన్న దిశలో ఎవరూ వెళ్లకుండా అడ్డుకోవాలి. గ్రామ ప్రజలందరూ సహకరించి ఈ హెచ్చరికను అందరికీ తెలియజేయగలరని అధికారులు కోరారు. దయచేసి నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు పాటించండని తెలిపారు.

# ఘనంగా కేసిఆర్ జన్మదిన వేడుకలు..



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు 72వ జన్మదిన వేడుకలు ఘనంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ కె డి సి సి బ్యాంకు చైర్మన్ కొండూరి రవీందర్ రావు, సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందం కళ కలిసి పార్టీ నాయకులతో కేక్ కట్ చేశారు.

అనంతరం తెలంగాణ భవన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం తోట ఆగయ్య మాట్లాడుతూ, ఉమ్మడి రాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన తెలంగాణ ప్రాంతానికి ప్రత్యేక రాష్ట్ర హోదా సాధించాలన్న సంకల్పంతో కేసీఆర్ ఉద్యమాన్ని ప్రారంభించారని అన్నారు. పదవులను తృణప్రాయంగా త్యజించి, ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలకైనా తెగించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహానేతగా నిలిచారని అన్నారు. 2014లో అధికారంలోకి వచ్చిన అనంతరం తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కేసీఆర్ మరెన్నో జన్మదినాలు ఆరోగ్యంగా, ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఇక్కడ సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ రాపెల్లి లక్ష్మి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంబాల మల్లారెడ్డి, మ్యాన రవి, బొల్లి రామ్మోహన్, సత్తర్, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న సిరిసిల్లలో మినీ జాబ్ మేళా..

### శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 20 ఉద్యోగావకాశాలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మినీ జాబ్ మేళా నిర్వహించబడుతున్నది. ప్రముఖ ప్రైవేట్ సంస్థ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ రాజన్న సిరిసిల్ల బ్రాంచ్‌లో బిజినెస్ డెవలప్మెంట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నియామకాలు చేపట్టనుంది. ఈ నియామక ప్రక్రియలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా లోని అన్ని మండలాల నుంచి మొత్తం 20 ఖాళీలు భర్తీ చేయబడనున్నాయి.రాజన్న సిరిసిల్ల జిల్లా లోని అన్ని మండలాల నుంచి 20 వరకు వేకెన్సీలు కలవు. తేదీ 19.02.2026 గురువారం సిరిసిల్ల ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజి రాజన్న సిరిసిల్ల అద్వర్యంలో సిరిసిల్ల ఎంప్లాయిమెంట్ ఆఫీసు క్ష్మీణఉజ ఖీ16 నందు ఉద్యోగాలు, కల్పించేందుకు మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీ నీల రాఘవేందర్ తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులకు నెలకు జీతం: 16,000/- నుంచి 40,000/- నూా ణూా వేతనం ఉంటుందని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా లోని అర్హత, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువకులు తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్స్ జిరాక్స్ కాఫీలతో రాజన్న సిరిసిల్ల జిల్లా లోని ఎంప్లాయిమెంట్ ఆఫీసు , సిరిసిల్ల నందు తేదీ. 19.02.2026 రోజున ఉదయం 11.00 గంటలకు జరుగు మినీ జాబ్ మేళాకు హాజరుకావాల్సిందిగా నిరుద్యోగ యువకులను శ్రీ రాఘవేందర్ జిల్లా ఉపాధి అధికారి గారు కోరడమైనది మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 90103 12496ఈ అవకాశాన్ని వినియోగించుకుని యువత ఉపాధి పొందాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి నీల రాఘవేందర్ విజ్ఞప్తి చేశారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా వాసులకు అలర్ట్..

- **మూడు రోజుల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్..**
- **నీటి శుద్ధి కేంద్రంలో మరమ్మతులు..**

**జిల్లాలో తాగునీటి సరఫరాకు అంతరాయం..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**


రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 120 ఎం.ఎల్.డి (మీాణ) సామర్థ్యం గల నీటి శుద్ధి కేంద్రంలో ఆపరేషన్ మరియు మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ మొహమ్మద్ ముజాహిద్ అన్వర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ మరమ్మతుల కారణంగా ఈనెల 20వ తేదీ (శుక్రవారం) నుంచి 22వ తేదీ (ఆదివారం) వరకు మూడు రోజుల పాటు ప్లాంట్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల సిరిసిల్ల, వేములవాడ మరియు చొప్పదండి నియోజకవర్గాల పరిధిలోని అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలకు నీటి సరఫరా నిలిచిపోనుంది. తిరిగి 23వ తేదీ (సోమవారం) నుండి నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని ఆయన వెల్లడించారు. అప్పటివరకు ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.

## కేసీఆర్ ఒక ఉద్యమం, ఒక విజన్, యుగ ప్రభంజనం..

- **మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు**

**బలగం టీవీ, హైదరాబాద్:**



తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) పుట్టినరోజు సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు సోషల్ మీడియా వేదికగా అత్యంత ఆత్మీయంగా, భావోద్వేగంతో కూడిన శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ కేవలం ఒక వ్యక్తి కాదు, తెలంగాణ ఆత్మగౌరవానికి నిదర్శనమని ఆయన కొనియాడారు.

"కేసీఆర్ అనే మూడు అక్షరాలు ఒక యుద్ధ నినాదం, దశాబ్దాల తెలంగాణ ఆకాంక్షల ప్రతిధ్వని" అని హరీశ్ రావు పేర్కొన్నారు. యావత్ తెలంగాణను ఏకతాటిపైకి తెచ్చి, రాష్ట్రాన్ని సాధించిన దృఢసంకల్పం ఆయనదని కొనియాడారు. తెలంగాణ చరిత్రలో ప్రతి తరానికి ఒక టార్చ్‌బేరర్ ఉంటారని, కానీ మొత్తం తెలంగాణకే కేసీఆర్ ఒక టార్చ్‌బేరర్ అని అభివర్ణించారు. ఆధిపత్య శక్తుల కుట్రలను తన వ్యూహాలతో పటాపంచలు చేసిన ధీశాలి కేసీఆర్ అని ప్రశంసించారు. కేసీఆర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ.. "మీరు కేవలం నా మేనమామ మాత్రమే కాదు, నా సర్వస్వం. రాజకీయంగా నాకు ఓనమాలు దిద్దించి, ప్రజా సేవలో నన్ను తీర్చిదిద్దారు" అని హరీశ్ రావు ఎమోషనల్ అయ్యారు. రాజకీయంగా నాకు ఓనమాలు దిద్దించి విలువలు నేర్పించి ప్రజా సేవలో నన్ను తీర్చిదిద్దారు.ఉద్యమనిర్మాతగా ప్రగతి ప్రదాతగా దేశచరిత్రలో సువర్ణాధ్యాయాన్ని లిఖించుకున్న మీ జన్మదినం తెలంగాణ ప్రజలకు పర్వదినం...మీరు నిండు నూరేళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో వర్ధిల్లాలని, జాతికి మీ నాయకత్వం మరిన్ని దశాబ్దాలు దిశా నిదర్శనం చేయాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.తెలంగాణ ప్రజలకు ఎనలేని విశ్వాసం, ఎనలేని ప్రేరణ అయిన ప్రియతమ నేత కేసీఆర్ కి హృదయ పూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఎంపీ వద్దిరాజు పుట్టినరోజు శుభాకాంక్షలు..

**బలగం టీవీ, హైదరాబాద్**



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు పుట్టినరోజు సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గాంధీజీ చూపిన అహింసా మార్గంలో 14 ఏళ్ల పాటు మహోద్యమాన్ని నడిపి దేశంలోని అన్ని పార్టీలను మెప్పించి,ఒప్పించి చావు నోట్లో తలపెట్టి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన మహానేత కేసీఆర్ అని ఎంపీ రవిచంద్ర కొనియాడారు.ప్రజల చిరకాల కోరికను నెరవేర్చడమే కాక తొలి ముఖ్యమంత్రిగా సుపరిపాలన అందించి తెలంగాణను అన్ని రంగాలలో అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దిన దార్శనికులు కేసీఆర్ అని ఎంపీ రవిచంద్ర తన ప్రకటనలో పేర్కొన్నారు. మిషన్ కాకతీయ పథకాన్ని చేపట్టి చెరువులు,కుంటలను పునరుద్ధరించి భూగర్భ జలాల మట్టాలను పెంచారని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మింపజేసి తెలంగాణను ఆకుపచ్చగా, సస్యశ్యామలంగా తీర్చిదిద్దిన మహానేత కేసీఆర్ అని ఎంపీ రవిచంద్ర శ్లాఘించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రజలందరికి పరిశుభ్రమైన తాగునీరందించారని, రైతుబంధు,రైతుబీమా పథకాలను కేసీఆర్ రూపొందించి విజయవంతంగా అమలు చేసి ఐక్యరాజ్యసమితి (యుఏన్వో),ఎంఎస్ స్వామినాథన్ వంటి సుప్రసిద్ధ శాస్త్రవేత్తల ప్రశంసలు అందుకున్న విషయాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు.

దళితబంధు ప్రవేశపెట్టి ఏస్సీల జీవితాలలో వెలుగులు నింపారని,ఏస్టీల రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచిన బహుజనుల పక్షపాతి కేసీఆర్ అని ఎంపీ వద్దిరాజు ప్రస్తుతించారు.దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయులు భారతరత్న డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని నెలకొల్పడమే కాక, అధునాతనంగా నిర్మించిన సచివాలయానికి ఆయన పేరు పెట్టి గౌరవించారని ఎంపీ వద్దిరాజు చెప్పారు.

అన్ని వర్గాల వారికి కార్పోరేట్ స్థాయిలో ఉన్నత ప్రమాణాలు కలిగిన విద్యనందించేందుకు పెద్ద సంఖ్యలో గురుకులాలు నెలకొల్పిన వైతాళికులు చంద్రశేఖర రావు అని ఎంపీ రవిచంద్ర వివరించారు.కేసీఆర్ మార్గదర్శనంలో కేటీఆర్ ఐటీ,ఫార్మా రంగాలతో పాటు హైదరాబాద్ నగరాన్ని ప్రగతిపథాన పరుగులు పెట్టించారని, హరీష్ రావు వైద్యాన్ని అన్ని వర్గాల ప్రజలకు మరింత చేరువ చేశారని ఎంపీ రవిచంద్ర చెప్పారు.తెలంగాణ ఏర్పాటుకు ముందు హైదరాబాద్ నుంచి ఐటీ రంగం ఎగుమతులు కేవలం 57 వేల కోట్ల రూపాయలు మాత్రమే గాక,2023-24 నాటికి 2లక్షల72వేల76 కోట్లకు 299% శాతం పెరగడం కేసీఆర్ పాలనాదక్షతకు ప్రబల నిదర్శనమని ఎంపీ వద్దిరాజు తెలిపారు.ఫార్మా ఉత్పత్తుల ఎగుమతులు 2019-20లో 34,800 కోట్ల రూపాయలు కాగా,2023-24 నాటికి 36,893 కోట్ల రూపాయలకు చేరుకున్నాయని చెప్పారు.తలసరి ఆదాయం 2014-15లో 1,24,104 రూపాయలు కాగా,2024-25 నాటికి 3,87,000 రూపాయలకు చేరుకోవడం కేసీఆర్ ఘనతే అని ఎంపీ రవిచంద్ర వివరించారు. మహనీయులు భారతరత్న డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ చూపిన రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రాన్ని సాధించడమే కాక పదేళ్లు సుపరిపాలన అందించి అన్ని రంగాలలో బంగారుమయంగా తీర్చిదిద్దిన కేసీఆర్ తెలంగాణ జాతిపిత అని ఎంపీ రవిచంద్ర కీర్తించారు.

## 23న రాష్ట్ర క్యాబినెట్ భేటీ

బలగం టీవీ, హైదరాబాద్

జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించిన దరిమిలా గ్రేటర్‌లో ఆస్తుల విభజన, ఉద్యోగుల సర్దుబాటే ప్రధాన ఎజెండాగా రాష్ట్ర మంత్రివర్గం ఈనెల 23న భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని సచివాలయంలో క్యాబినెట్ సమావేశం కానుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జీహెచ్ఎంసీ, సీఎంసీ, ఎంఎంసీలుగా విభజించిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మహానగర పాలక సంస్థకు ఇప్పుడున్న ఆస్తులు, అప్పులను మూడు కార్పొరేషన్లకు పంచాల్సి ఉంది. వాటి అవసరాలకు అనుగుణంగా ప్రస్తుతమున్న అధికా రులు, ఉద్యోగులు, సిబ్బందిని సర్దుబాటు చేయాల్సి ఉంది. ఈ అంశంపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. దీంతోపాటు త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్, ఆ మేరకు అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై క్యాబినెట్‌లో చర్చించ నున్నారు. పోలీస్, వైద్యం, ప్రజారోగ్యం తదితర కీలక శాఖల్లోని ఖాళీ పోస్టుల భర్తీపై కూడా మంత్రివర్గం సమాలోచనలు చేయనుంది. గత క్యాబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి అమలు, పురోగతిపై కూడా మంత్రివర్గం చర్చించనుంది.

## డాటా సెంటర్ల ఏర్పాటుపై సమగ్ర అధ్యయనం చేయాలి

- భూ కేటాయింపులో హేతుబద్ధతకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

బలగం టీవీ, హైదరాబాద్



రాష్ట్రంలో డాటా సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి ఇతర రాష్ట్రాలు అందిస్తున్న రాయితీలపై సమగ్ర అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాటా సెంటర్లకు భూ కేటాయింపులో హేతుబద్ధత పాటించాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో రాష్ట్రంలో డాటా సెంటర్లు స్థాపించేందుకు ముందుకు వచ్చిన సంస్థలు, వారికి అవసరమైన భూమి, మౌలిక వసతులపై చర్చించారు. వివిధ ప్రాంతాల్లో డాటా సెంటర్లు, ఇతర మౌలిక వసతుల కోసం సాగుతున్న భూసేకరణ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

భూ పరిహారం నిర్ణయించే విషయంలో ఉదారంగా వ్యవహరించాలని సీఎం సూచించారు. రైతులతో ప్రత్యక్షంగా చర్చించి, వారు సంతృప్తి చెందేలా పరిహారం నిర్ణయించాలని ఆదేశించారు. వేల కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టే సంస్థలకు భూమిపై పెట్టే పెట్టుబడి స్వల్పమేనని, కంపెనీలకు సకాలంలో భూమి, అవసరమైన వసతులు అందిస్తే పనులు వేగంగా పూర్తవుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక తదితరులు పాల్గొన్నారు.

## ముంబయికి సీఎం రేవంత్‌రెడ్డి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన పాల్గొంటారు. మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ముంబయి క్లైమెట్ వీక్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొంటున్నారు. తెలంగాణ అభివృద్ధి, హైదరాబాద్ విస్తృత ప్రగతి, పరిపాలన సంబంధిత అంశాల్లో రాష్ట్ర విజయాలను ఈ వేదికపై ఆయన వివరిస్తారు. మూడు రోజులపాటు జరిగే ముంబయి క్లైమెట్ వీక్ అంతర్జాతీయ సదస్సు బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని జియో కన్వెన్షన్ సెంటర్‌లో జరిగింది. మహారాష్ట్ర ప్రభుత్వం, ముంబయి కార్పొరేషన్ భాగస్వాములుగా ఉన్న ఈ సదస్సును ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించారు.

## కేసీఆర్‌కు శుభాకాంక్షల వెల్లువ

(మొదటి పేజీ తరువాయి)

భావోద్వేగంతో సోషల్ మీడియాలో స్పందించారు. "నా ఫరెవర్ హీరోకు 72వ పుట్టినరోజు శుభాకాంక్షలు. ప్రతి రోజూ నాకు ప్రేరణనిచ్చినందుకు ధన్యవాదాలు" అంటూ ట్వీట్ చేశారు. ఈ పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కూడా కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన పోషించిన పాత్రను గుర్తుచేస్తూ ప్రశంసలు కురిపించారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాయి. అనాథాశ్రమాలకు విరాళాలు, రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ కేసీఆర్ జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

## ఎన్నికల సంఘానికి బీఆర్ఎస్ ఫిర్యాదు

(మొదటి పేజీ తరువాయి)

సుమారు 30 మున్సిపాలిటీల్లో హంగ్ పరిస్థితి వచ్చినప్పటికీ, అధికార పార్టీ ఇష్టానుసారంగా ప్రవర్తించిందని అన్నారు. పోలీసులను ఉపయోగించి తమకు అనుకూలంగా ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. ఈ ఘటనలపై రాష్ట్ర ఎన్నికల సంఘం కచ్చితమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత ఎన్నికల సంఘంపైనే ఉందని వారు పేర్కొన్నారు.

## ఘనంగా కేసీఆర్ 72వ జన్మదిన వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

దేశం ఆశ్చర్యపడే విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. అధికారం శాశ్వతం కాదని, అధికారంలో ఉన్నామని దౌర్జన్యాలకు పాల్పడితే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల సందర్భంలో ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరించిన తీరును విమర్శించారు. మూడేళ్ల తర్వాత తిరిగి తమ ప్రభుత్వమే వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, సుధీర్ రెడ్డి, తెలంగాణ భవన్ ఇంచార్జి రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమకారులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

# ప్రపంచ జీవవైజ్ఞానిక రాజధానిగా హైదరాబాద్

- తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాలు భాగస్వాములు కావాలి
- బయోఏషియా వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- హైటెక్స్‌లో ప్రతిష్ఠాత్మకమైన 23వ బయో ఏషియా అంతర్జాతీయ సదస్సు




బలగం టీవీ, హైదరాబాద్

ప్రపంచ వ్యాక్సిన్ తయారీ కేంద్రంగా ఖ్యాతిగాంచిన హైదరాబాద్‌ను ప్రపంచ జీవవైజ్ఞానిక రాజధానిగా తీర్చిదిద్దేందుకు అన్ని వర్గాలు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ హైటెక్స్‌లో నిర్వహించిన 23వ అంతర్జాతీయ దీఆశీూంఱఖి 2026 సదస్సును పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. 'టెక్‌బయో అన్‌లీష్డ్ – ఏఐ, ఆటోమేషన్, జీవశాస్త్ర రంగంలో విప్లవాత్మక పరిణామాలు' అనే ఇతివృత్తంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ ఇతర రాష్ట్రాలతో కాకుండా ప్రపంచ అగ్రగామి క్లస్టర్లతో పోటీ పడుతోందన్నారు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా మారిందని పేర్కొన్నారు. బల్క్ డ్రగ్స్ నుంచి బయాలజిక్స్ వరకు, తయారీ నుంచి ఆవిష్కరణ వరకు రాష్ట్రం సమగ్ర అభివృద్ధి సాధిస్తోందన్నారు. జీవవైజ్ఞానిక రంగంలో పరిశోధన సంస్థలు, కార్పొరేట్లు, స్టార్టప్‌లు, చిన్న మధ్య తరహా సంస్థలు, ప్రభుత్వం మధ్య బలమైన భాగస్వామ్యం అవసరమన్నారు. తెలంగాణ పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తోందని, జీసీసీలు, ఇన్నోవేషన్ కేంద్రాలు, ఏఐ ఆధారిత వేదికలు, డిజిటల్ తయారీ రంగాలను ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు.

గత రెండేళ్లలో జీవవిజ్ఞాన రంగంలో రూ.73 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. దావోస్‌లో జరిగిన World Economic Forum సందర్భంగా రాష్ట్ర నూతన లైఫ్ సైన్సెస్ పాలసీని ప్రకటించామని చెప్పారు. జీనోమ్ వ్యాలీ విస్తరణతో పాటు వన్–బయో కార్యక్రమాన్ని ప్రారంభించామని వెల్లడించారు. "తెలంగాణ రైజింగ్ 2047" విజన్ ప్రకారం 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా 500కు పైగా సంస్థలు, దాదాపు నాలుగు వేల ప్రతినిధులు పాల్గొన్న ఈ సదస్సు భవిష్యత్తులో దావోస్ తరహా అంతర్జాతీయ గుర్తింపు పొందుతుందని ముఖ్యమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెన్సిల్వేనియా యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ ప్రొఫెసర్ బ్రూస్ ఎల్ లెవిన్‌కు జీనోమ్ వ్యాలీ ఎక్సలెన్స్ అవార్డు--2026ను ముఖ్యమంత్రి అందజేశారు.

## మూడు నగర పాలక సంస్థల పరిధిలో పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆదాయం సమకూర్చుకునే అంశంపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దానిని పరిశీలించిన ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు. మూడు నగర పాలక సంస్థలతో పాటు రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణ విషయంలో యూనికోడ్ సిస్టమ్ అనుసరించాలని ముఖ్యమంత్రి గారు అధికారులను ఆదేశించారు. ఈ కార్పొరేషన్ల పరిధిలోని పార్కుల వివరాలు, వాటి అభివృద్ధిపైన ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

రాష్ట్రంలో నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, ఛైర్మన్లు, డిప్యూటీ ఛైర్మన్లతో త్వరలోనే ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నగరాలు, పట్టణాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలను సమగ్రంగా వివరించాలని సూచించారు.సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనర్లు ఆర్‌వి కర్ణన్, శ్రీజన, వినయకృష్ణారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఖాతాలో కీలక మున్సిపాలిటీలు

బలగం టీవీ, హైదరాబాద్

సోమవారం వాయిదా పడిన 11 మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికలు మంగళవారం నిర్వహించగా, పలుచోట్ల తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య పోటీ హోరాహోరీగా సాగింది. కోరం లేకపోవడంతో మూడు చోట్ల ఎన్నికలు మళ్లీ వాయిదా పడ్డాయి.

ఇల్లందు: ఛైర్మన్‌గా దొడ్డ కిరణ్‌మిత్ర, వైస్ ఛైర్మన్‌గా పెండేల రాజు ప్రమాణ స్వీకారం చేశారు.

కాగజ్‌నగర్: బీజేపీ మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి షాహిన్ సుల్తానా ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు.

డోర్నకల్: ఛైర్‌పర్సన్‌గా కొండేటి రాజకుమారి, వైస్ ఛైర్‌పర్సన్‌గా మాద లావణ్య ఎన్నికయ్యారు.

జనగామ, తొర్రూర్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో బలాబలాలు సమానంగా ఉండటంతో లాటరీ తీయగా, కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లు రావడంతో రెండు మున్సిపాలిటీలూ కాంగ్రెస్ ఖాతాలో చేరాయి.

సుల్తానాబాద్: ఛైర్మన్‌గా బిరుదు కృష్ణ, వైస్ ఛైర్‌పర్సన్‌గా పుష్పలత ఎన్నికయ్యారు.

జహీరాబాద్: ముగ్గురు స్వతంత్రులు, ఇద్దరు ఎంఐఎం సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ అభ్యర్థి యూనుస్ విజయం సాధించారు. ఎంపీ సురేష్ షెట్కార్ ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఓటు వేశారు.

**బీఆర్ఎస్‌కు ఇంద్రేశం మున్సిపాలిటీ**

ఇంద్రేశం మున్సిపాలిటీలో బీఆర్ఎస్ అభ్యర్థి కె. ప్రమీల ఛైర్‌పర్సన్‌గా, హరీశ్‌రెడ్డి వైస్ ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు.

**క్యాతన్‌పల్లి, ఖానాపూర్‌లో వాయిదా**

క్యాతన్‌పల్లి మున్సిపల్ పాలకవర్గం ఎన్నిక గొడవల కారణంగా వాయిదా పడింది. బీఆర్ఎస్ (10), సీపీఐ (4) సభ్యులు ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. మంత్రి వివేక్, ఎంపీ వంశీపై బీఆర్ఎస్ నేతలు ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ సభ్యులు నిబంధనలు ఉల్లంఘించారని బీఆర్ఎస్ విమర్శించింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోనూ కోరం లేకపోవడంతో ఎన్నికలు వాయిదా పడ్డాయి.

**ఇబ్రహీంపట్నం ఎన్నికపై హైకోర్టు స్టే**

ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికపై హైకోర్టు స్టే విధించడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికను నిలిపివేసింది. 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి అపహరణకు గురయ్యాడంటూ దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ చేపట్టింది. యాదగిరిని హాజరుపరచాలని ఆదేశించింది. అనంతరం బీఆర్ఎస్ శ్రేణులు మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టాయి.

**ఎర్రబెల్లి భావోద్వేగం**

తొర్రూర్ మున్సిపాలిటీ కోల్పోవడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయనను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యుల మధ్య ఘర్షణల కారణంగా కొన్ని చోట్ల ఎన్నికలు వాయిదా వేసినట్లు రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు.

## ఎన్నికల కోడ్ ఎత్తివేత

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల సందడి ముగింపు దశకు చేరుకుంది. మేయర్, డిప్యూటీ మేయర్, ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్ల ఎన్నికలు మూడు మున్సిపాలిటీలు మినహా అన్ని చోట్ల పూర్తయ్యాయి. ఎన్నికలు నిర్వహించిన 116 పురపాలికలు, 7 నగరపాలికలు కలిపి మొత్తం 123 స్థానాల్లో 120 స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ముగిసింది. దీంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళిని ఎత్తివేసింది. ఈ మేరకు ఎస్ఈసీ కార్యదర్శి లింగ్యానాయక్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి, ఖానాపూర్ మున్సిపాలిటీల్లో అనివార్య కారణాలతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. ఆయా జిల్లా కలెక్టర్లు పరిస్థితులపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి నివేదిక అందించనున్నారు. ఈ మూడు చోట్ల ఎన్నికలను ఈ నెల 20న నిర్వహించే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. 21న రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘం సమావేశానికి హాజరుకావాల్సి ఉండటంతో ముందుగానే ఎన్నికలు నిర్వహించే దిశగా నిర్ణయం తీసుకునే అవకాశముందని సమాచారం.